క్లుప్తంగా

నేడు నారాయణరెడ్డి వర్ధంతి

వెల్దుర్తి(కృష్ణగిరి): పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భర్త దివంగత చెరుకులపాడు నారాయణ రెడ్డి, బోయ సాంబశివుడు 7వ వర్ధంతిని మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు చెరుకులపాడు గ్రామంలోని నారాయణరెడ్డి ఘాట్ వద్ద ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తమ కుటుంబసభ్యులతో నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ

తుగ్గలి: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 31 వరకు నిర్వహించనున్నట్లు ఎంఈఓ–2 రామవెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాల, నోవీ కాన్సెప్ట్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రెండు కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షలకు 334 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు.

రోగులకు అన్నదానం



రోగులకు అన్నదానం చేస్తున్న అభిమానులు

హొళగుంద: సినీ నటుడు జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం ఆయన అభిమానులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అన్నదానం చేశారు. ముందుగా ఆస్పత్రి ఆవరణంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు, రోగుల సహాయకులకు అన్నదానం చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం, నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ నరేంద్ర

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామ శివారులో పంప్‌హౌస్ వద్ద పోలీసులు సోమవారం కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నరేంద్ర తెలిపిన వివరాలు.. కర్ణాటక మద్యం తరలుతోందని వచ్చిన పక్కా సమాచారంతో పోలీసులు సోదాలు చేపట్టారు. ఆలూరు మండలం పెద్ద హోతూరుకు చెందిన గొల్ల రాజశేఖర్ బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తూ దొరికిపోయాడు. రాజశేఖర్ నుంచి ఆరు బాక్సుల 90 ఎంఎల్ ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు, బైక్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. సోదాల్లో పోలీసు కానిస్టేబుళ్లు రాజశేఖర్, విజయ్ పాల్గొన్నారు.

నాటు సారా బట్టీ ధ్వంసం



నాటు సారా బట్టీని ధ్వంసం చేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: వెల్దుర్తి మండలం ఎల్.బండ తండాలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటుసారా బట్టీపై సిబ్బందితో దాడి చేసి 1,650 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు, 15 లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు సోమవారం తెలిపారు. నాటుసారా బట్టీ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. దాడుల్లో డీటీఎఫ్ స్క్వాడ్ సీఐ నరసనాయుడు, సిబ్బంది శంకర్ నాయక్, గోపాల్ నాయక్, వెంకట్రాముడు, కరుణాకర్, షేక్షావలి పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌంటింగ్‌లో రాజకీయ పార్టీల ఏజెంట్లు, నాయకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, లేదా వారి ప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని ఆర్‌ఓ కోరారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- నియోజకవర్గంలోని ఆరు మండలాలకు 4,765 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయింపు
- ఆర్బీకేల ద్వారా సబ్సిడీ విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు

వరుణుడి కరుణతో పుడమి పులకించింది. నియోజకవర్గం వ్యాప్తంగా ఈ నెల 10 నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 83 వేల హెక్టార్లకు పైగా పంటల సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారుల అంచనా వేసి రాయితీ విత్తనాలతో పాటు ఎరువులను సరఫరా చేసేందుకు సిద్ధం చేశారు. అన్నదాతలు విత్తనాల కోసం తమ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పేర్లను నమోదు చేయించుకుంటున్నారు. – ఆలూరు రూరల్

ఖరీఫ్ సాగుకు వ్యవసాయ శాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని 6 మండలాల్లో 83,135 వేల హెక్టార్లలో పంటల సాగయ్యే అవకాశం ఉండటంతో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేశారు. 4,765 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయడానికి సోమవారం నుంచి ఆర్బీకేల్లో రైతులు పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. కంది, మినుము విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. రైతుల అవసరాన్ని బట్టి ఎరువులను ఆర్డర్ చేస్తే 24 గంటల్లోపు సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

ఆర్బీకేల ద్వారా రాయితీ విత్తనాల పంపిణీ

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ ఏడాది 6 మండలాలకు కే–6 రకం విత్తనాలు 4,120 క్వింటాళ్లు, 450 క్వింటాళ్ల టీసీజీఎస్–1694 రకం, 195 క్వింటాళ్ల కదిరి లేపాక్షి రకం వేరుశనగ విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశారు. సోమవారం నుంచి అన్ని ఆర్బీకేల్లో విత్తన రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయి. క్వింటం వేరుశనగ విత్తనాల ధర రూ. 9,500 ఉండగా, ప్రభుత్వం 40 శాతం రాయితీ (రూ.3,800) పోను రైతు రూ.5,700 చెల్లించాల్సి ఉంటుంది.

విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఖరీఫ్ సాగుకు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.
- వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన కంపెనీ డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి
- కొనుగోలు సమయంలో డీలర్ నుంచి రశీదు తప్పని సరిగా తీసుకోవాలి.
- విత్తన సంచి, ట్యాగ్‌ను పంట కాలం చివరి వరకు భద్రంగా ఉంచుకోవాలి.
- పంట సాగు చేసే ముందే మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి.
- ఏదైనా సమస్య వస్తే మండల వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకెళ్లాలి.



అలికెర గ్రామ సమీపంలో పొలం దున్నుతున్న రైతు

మండలాల వారీగా వేరుశనగ విత్తనాల కేటాయింపు

మండలం	కేటాయించిన విత్తనాలు (క్వింటాళ్లలో..)
ఆలూరు	240
ఆస్పరి	1,300
చిప్పగిరి	20
హాలహర్వి	205
హొళగుంద	105
దేవనకొండ	2,850

సర్వం సిద్ధం



ఖరీఫ్ సీజన్‌లో రైతుల సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించేందుకు సర్వం సిద్ధం చేశాం. ఇప్పటికే ఆర్బీకేల ద్వారా విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. దీంతో పాటు ఎరువులను కూడా ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి ప్రణాళిక సిద్ధం చేశాం. రిజిస్ట్రేషన్ పూర్తికాగానే రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తాం.

– సునీత, ఏడీఏ, ఆలూరు

నాణ్యతగా పనులు చేపట్టండి

- పీఆర్ పీఐయూ డీఈఈ భాస్కర్



నాణ్యతను పరిశీలిస్తున్న డీఈఈ భాస్కర్

హొళగుంద: నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని పీఆర్ పీఐయూ డీఈఈ భాస్కర్ ఏఈ చంద్రశేఖర్ సూచించారు. కర్ణాటక సరిహద్దులో జరుగుతున్న హొళగుంద – మార్లమడికి 5.10 కి. మీల డబుల్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్ రఘునాథ్‌రెడ్డికి సూచించారు.

ఉపాధి పనులు ఉపయోగించుకోండి



పనులు పరిశీలిస్తున్న ఏపీడీ పక్కీరప్ప

మద్దికెర: వ్యవసాయ కూలీలు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ పక్కీరప్ప సూచించారు. సోమవారం మద్దికెర సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల్లో రైతులకు ఉపయోగపడే విధంగా పనులు ఉండాలని సిబ్బందికి సూచించారు. కొలతల ప్రకారం పనులు చేస్తే పూర్తిస్థాయి వేతనాలు అందుతాయని కూలీలకు తెలిపారు.

కనుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం



వీర బ్రహ్మేంద్రస్వామి ఊరేగింపులో చెక్కభజన బృందం ప్రదర్శన

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం స్వామి ఆరాధనోత్సవాన్ని గ్రామస్తులు వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి చిత్రపటాన్ని గ్రామ వీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపు ముందు నందికోల నృత్యం, గురువు శీలన్న బృందం చెక్కభజన కార్యక్రమం ఆకట్టుకుంది. ఆరాధనోత్సవం సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దికెర: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశానికి ఈనెల 22 వతేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సవిత సోమవారం తెలిపారు. ఓబీసీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పదో తరగతి మార్కులు ఆధారంగా ప్రవేశం కల్పించనున్నట్లు చెప్పారు.

చిప్పగిరి: ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వరదరాజులు సోమవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి గ్రూప్‌లో మొదటి సంవత్సరంలో 88 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు జూన్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దుండగుల దుశ్చర్య

- నూతనంగా వేసిన రోడ్డును ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు
- పట్టించుకోని పోలీసులు





రోడ్డును ధ్వంసం చేసిన దృశ్యాలు

మద్దికెర: నూతన రోడ్డును ధ్వంసం చేసి దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. రెండు నెలల క్రితం రూ.8.50 కోట్లు ఖర్చు చేసి మద్దికెర–మొలగవెల్లి రోడ్డును వేశారు. రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డుపై రెండు చోట్ల గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అటుగా వెళ్లిన వారు గమనించి ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రోడ్డును ధ్వంసం చేయడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా విషయం తెలిసినా పోలీసులు అటువైపు తొక్కి చూడలేదు. ఇంతకు ముందు కూడా అభివృద్ధి పనుల శిలాఫలకాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఆ విషయంలోనూ పోలీసులు నిందితులను గుర్తించడం కానీ, చర్యలు తీసుకోవడం కానీ చేయలేదు. అందుకే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. రోడ్డు ధ్వంసం ఘటనను ఎస్‌ఐ రమేష్‌బాబు దృష్టికి 'సాక్షి' తీసుకెళ్లగా బిజీగా ఉండటంతో అక్కడికి వెళ్లలేకపోయానని, రేపు ఉదయం వెళ్లి విచారిస్తానని చెప్పారు.

ఊపందుకున్న పేర్ల నమోదు ప్రక్రియ

కృష్ణగిరి: ఖరీఫ్ సాగుకు సబ్సిడీ వేరు శనగ విత్తనాల కోసం కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకునే ప్రక్రియ ఊపందుకుంది. సోమవారం రైతు భరోసా కేంద్రాల్లో పలువురు రైతులు పేర్లు నమోదు చేయించుకున్నారని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మరో నాలుగైదు రోజుల్లో వేరుశనగ కాయలు రైతు భరోసా కేంద్రాలకు వస్తాయని, గ్రామాల వారిగా పంపిణీకి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

- **దేవనకొండ:** మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశనగకాయల కోసం సోమవారం నుంచి రైతులు పేర్లు నమోదు చేసుకునే ప్రక్రియను ప్రారంభించినట్లు ఏఓ సురేష్‌బాబు తెలిపారు. వేరుశనగకాయలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పాసు పుస్తకం, ఫోన్ నంబర్‌తో ఆర్‌బీకేల్లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి పేర్ల నమోదు..

తుగ్గలి: సబ్సిడీ విత్తనాల కోసం మంగళవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ మండల అధికారి పవన్‌కుమార్ రైతులకు సూచించారు. మండలానికి 2,650 క్వింటాళ్ల వేరుశనగను ప్రభుత్వం కేటాయించిందన్నారు. కే6 రకం క్వింటాల్ పూర్తి ధర రూ.9,500 కాగా 40 శాతం సబ్సిడీ పోనూ మిగతా రూ.5,700 రైతులు చెల్లించాలన్నారు. 30 కేజీల విత్తన బస్తాకు రూ.1,710 చెల్లించాల్సి ఉందన్నారు.

ఆస్పరి మండలానికి 1,370 క్వింటాళ్లు

ఆస్పరి: సబ్సిడీ వేరుశనగ విత్తనాలు మండలానికి 1370 క్వింటాళ్లు మంజూరైనట్లు ఏఓ నరేంద్రకుమార్ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ సబ్సిడీ విత్తనాలు కావాల్సిన రైతులు మంగళవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

రేపటి నుంచి..

మద్దికెర: ఈనెల 22 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ రవి సోమవారం తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



చందోలిలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ మురళీమోహన్

పత్తికొండ రూరల్: శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని పత్తికొండ టౌన్ సీఐ మురళీమోహన్ హెచ్చరించారు. సోమవారం ఆయన తన సిబ్బందితో కలిసి చందోలి గ్రామంలో పర్యటించారు. అనంతరం సుంకులమ్మ ఆలయం వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఫలితాల సందర్భంగా ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- **హాలహర్వి:** మండలంలోని బాపురం, గూళ్యం, చింతకుంట గ్రామాల్లో సోమవారం ఎస్‌ఐ నరేంద్ర పర్యటించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, ఫలితాల సందర్భంగా కూడా ఎవరూ ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని ఆయా గ్రామస్తులకు సూచించారు.